


సాయంత్రం మూడు గంటలకు రావలసిన రైలు బండి మరో మూడుగంటలు ఆలస్యంగా వచ్చి— స్టేషన్‌లో ఆగింది. "సెకండ్‌క్లాసు కంపార్ట్‌మెంట్"లో నుంచి దిగిన మధు—ఒకసారి ప్లాట్‌ఫారమ్ అంతా చూశాడు ... తనకోసం ఎవరయినా స్టేషన్‌కు రాక పోతారా అనుకున్న మధుకు ఆశా భంగమే అయింది.. అయినా తాను ఫలానా బండిలో వస్తున్నట్లు ముందుగా ఇంటికి వుత్తరం వ్రాసి వుంటే బండి కట్టించి ఎవర్నైనా పంపించివుండే వాడు తన తండ్రి...... చేతిలోవున్న 'ఎయిర్‌బాగ్' భుజాన వేసుకొని 'టైం' చూసుకున్నాడు మధు. ఆరు గంటలు దాటి అప్పుడే ఆరు నిముషాలయింది. శీతాకాలం కావటం వల్ల, చలిగాలి అప్పుడే విజృంభిస్తోంది. ప్రయాణం హడావిడిలో 'మఫ్లర్'యినా తెచ్చుకోనందుకు తనను తానే నిందించు కున్నాడు. ప్లాట్ ఫారమ్ మీద ఒక్క మనిషికూడా లేడు. అసలు ఇదివరలో అక్కడ ఏరైలూ ఆగేదికాదు. కానీ ఆ ప్రక్కన రెండు మైళ్ళ దూరంలోవున్న వూళ్ళో, ఒక నాయుడుగారున్నారు. ఆయనగారు రైల్వే బోర్డులో చిన్న సభ్యత్వం సంపాదించటం వల్ల నైతేనేమి, తన పలుకు బడిని రైల్వే అధికారుల వద్ద ఉపయోగించటం వల్ల నైతేనేమి ఈమధ్య— అంటే సుమారు ఆరు నెలల నుంచీ, అక్కడ బండి ఆపటం జరుగు తోంది. టిక్కట్లు ఇవ్వటం, పుచ్చుకోవటం దగ్గర నుంచి గంటకొట్టటం వరకూ— స్టేషన్ మాస్టరే చూసుకుంటూంటాడు.. ఒక పోర్టర్ ఉన్నాడు కానీ, వాడెప్పుడూ 'కల్లు పాక' లోనే వుంటూంటాడు.....

"హలో! మీరు ఎక్కడకు వెళ్ళాలి"—అని 'రూం'లోంచి ఇవతలకు వచ్చిన స్టేషన్ మాస్టరు— ఒంటరిగా వున్న మధుని ఒక వింత జంతువుని చూసినట్లుగా చూసి, ప్రశ్నించాడు.

మధు జవాబు చెప్పి తన జేబులోంచి టికెట్ తీసి ఇచ్చాడు. దాన్ని తీసుకుని తన రూంలోకి వెళ్ళి, మరో నిమిషానికి తిరిగి వచ్చి, గదికి తాళం వేశాడు స్టేషన్ మాస్టరు.

"ఇదిగో! మిస్టర్! నేను నా క్వార్టర్‌కు పోతున్నాను. మళ్ళీ రేపు మధ్యాహ్నం వరకూ ఇక్కడ ఏబండీ ఆగదు. ఒకవేళ మీ వాళ్ళెవరూ రాక పోయి—నువ్ ఇక్కడే ఈరాత్రికి వుండి పోవాల్సి వస్తే —అదిగో—అకనబడేదే నా క్వార్టర్...అక్కడికి వచ్చేయ్!......'యూకెన్ స్పెండ్ దిస్ నైట్ విత్‌మీ!' — అంటూ దాటి పోతున్న రైలు పట్టుకునేందుకు ప్రయత్నించే ప్రయాణీకునిలా వెళ్ళిపోయాడు.

అతని హడావిడి చూసి నవ్వుకొని స్టేషన్‌బయటకు నడిచాడు మధు. చేలగట్టు పుచ్చుకొని నాలుగు మైళ్ళు నడవాలి. తన చిన్నతనంలో దాదాపు ప్రతిరోజూ — చేలగట్లమీద పడి—మైళ్ళతరబడి నడిచేవాడు. ఇప్పుడు కొత్తగా నడవటం నుంచే చిరాకు కలుగుతోంది తనకు.

సిగరెట్ ముట్టించి నడక ప్రారంభించాడు మధు.

అలవాటయిన దారే అయినా—ఆ సంజె చీకటిలో ఎత్తుపల్లాలనీ, గతుకుల్నీ అధిగమించి వేగంగా నడవటం కష్టమే నని పిస్తోంది. దూరంగావున్న మామిడి చెట్లు ఆ నల్లని చీకటిలో మరింత నల్లగా—వికృతంగా కనిపిస్తున్నాయి ఎంత నడచినా నడవవలసింది చాలా మిగిలినట్లు ఫీలయ్యాడు మధు మళ్ళీ గడియారం చూసుకున్నాడు. 'రేడియం డయల్'లోని ముళ్ళు ఏడుగంటలయినట్లు చూపిస్తున్నాయి.

చలి బాధ భరించలేక నల్లటి చీకటిని కప్పుకునే టందుకు ప్రయత్నిస్తోంది సంధ్య. మధు హృదయాన్ని మెట్టూ ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

మెడిసిన్ ఫైనలియర్ వదువుతూన్న మధు వెంటనే బయల్దేరి రమ్మని తండ్రి వద్దనుండి వచ్చిన టెలిగ్రాం చూచుకొని అక్కడకు వచ్చాడు. మధు స్వగ్రామానికీ రైలు స్టేషనుకూ దాదాపు ఆరు మైళ్ళ దూరం ఉంటుంది. చేలగట్లు పుచ్చుకుంటే నాలుగు మైళ్ళే!....

అంత హఠాత్తుగా బయల్దేరి రమ్మని తన తండ్రి టెలిగ్రాం ఎందుకు ఇచ్చాడో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు మధుకు.. ఒకవేళ ఎవరయినా తనకు పిల్లను ఇవ్వాలని వచ్చి వుండవచ్చు. ఏమైనా తాను రాధను తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోకూడదని అక్కడాన తీర్మానించు కున్నాడు. అయినా రాధ తనకోసమే పుట్టిందని తన చిన్నపుడు అందరూ అనుకునే వారు. ఇప్పుడు కాదంటే అయిపోతుందా?......

ఆలోచిస్తూనే 'నాగమ్మగుడి' దగ్గరకు వచ్చేశాడు మధు. ఇక మైలు దూరం నడిస్తే తన వూరు చేరు

కోవచ్చు. చాలామంది— చందాలు వేసుకొని అవూరు గ్రామదేవత అయిన 'నాగమ్మ'కు గుడి కట్టించారు. దాని ప్రక్కనే నుయ్యి... ఆరెండింటికీ వెనకాల— వూడలు దిగిన మర్రిచెట్టు... అవూరిమీదుగా వెళ్ళే చాలా మంది ప్రయాణీకులు అక్కడి దేవతకు మ్రొక్కుకొని కాసేపు చెట్టు క్రింద సేద తీర్చుకొని మరీ వెడుతూంటారు.

మధు ఎన్నో సార్లు రాధను ఆచెట్టుక్రింద కలుసుకున్నాడు. ఇద్దరూ ఆదేవత ఎదుట ఎన్నో వాగ్దానాలు చేసుకున్నారు.

గుడిదగ్గరకు వచ్చిన మధు ఒకసారి తన చేతులు జోడించి ఆ గ్రామ దేవతకు నమస్కరించి ముందుకు నడిచాడు.

"బావా!"......

అక్కడి నిశ్శబ్దాన్ని చీల్చుకొని వచ్చిన ఆ పిలుపుతో అప్రయత్నంగా ఆగిపోయాడు మధు. చిర పరచితమయిన ఆ పిలుపు వచ్చిన దిక్కుకు చూశాడు.

అంతా చీకటి......

"ఇక్కడ బావా! ఈచెట్టు దగ్గరవున్నాను." మర్రిచెట్టు దగ్గరకు మంత్రముగ్ధునిలా నడచాడు మధు. వూడలు దిగిన ఆచెట్టుక్రింద కూర్చొని వుంది రాధ......

"ఏమిటి రాధా? ఇంతరాత్రి..... ఒంటరిగా ఇక్కడా?" మతిపోయిన వానిలా అడిగాడు మధు...

"తప్పలేదు బావా! నిన్ను కలుసుకునేందుకు ఇది తప్ప వేరే మార్గం లేకపోయింది. నిన్ను వెంటనే రమ్మనమని మావయ్య టెలిగ్రాం ఇచ్చినట్టు తెలిసింది. నువ్వెలాగా ఈరాత్రికి వస్తావని— ఇక్కడ కూర్చొని— ఎదురు చూస్తున్నాను..."

"నీకేం పిచ్చిపట్టిందా? వూరు వచ్చినవాడ్ని మీయింటికి రాకుండా పోతానా? ఇంత చీకట్లో ఇల్లువదలి పెట్టి వచ్చావా? ఎవరికైనా తెలిస్తే ఏమవుతుంది?.....ఏం పని రాధా ఇది?...." మధు మాటలు ఆవేశంగా వున్నాయి.

"ఆవేశపడకు బావా! నేనిలా వచ్చినట్టు ఎవరికీ తెలియదులే—అయినా నీకో ముఖ్య విషయం ఇచెప్పాలనే వచ్చాను!"

"ఏమిటి?"......

"మావయ్య నీకు వేరే సంబంధం నిశ్చయించాడు. పాతిక వేలు కట్నం ఇస్తారట"— రెండు క్షణాలు ఆగింది రాధ..

"ఈ గుడిలోని దేవత సాక్షిగా నిన్ను ఏనాడో నాభార్యగా స్వీకరించాను. ఈనాడు పాతిక వేలక ఆశ పడి నీకు ద్రోహం చేస్తాననుకోకురాధ! అవసరమయితే ఈ నిజాన్ని మానాన్నకు చెప్తాను"

"కట్నానికి నువ్ ఆశపడక పోవచ్చు. కానీమావయ్యకు కావలసింది డబ్బు.. మనపెళ్ళి సంగతి మాట్లాడ టానికి ఆమధ్య ఒకసారి అమ్మ మీ యింటికి వెళ్ళింది. చిన్ననాటి మాటలన్నీ మరచిపోయి అంతస్తులకు విలువగట్టి ఆస్తిపాస్తులు లేని మమ్మల్ని చాలా అవమానించాడు మావయ్య. నాపెళ్ళికయ్యే ఖర్చు తాను భరిస్తాననీ, ఉన్నత స్థితికి చేరుకొనే నీమీద ఆశలు పెంచుకో వద్దనీ హెచ్చరించాడు." రాధ గొంతు గద్గదికమయింది.

## రాధ

"అలా ఎన్నటికీ జరుగదు రాధా! జరుగనివ్వను." రాధను తన దగ్గరకు తీసుకొన్నాడు మధు.

"కానీ జరిగి పోయింది బావా! అంతాజరిగి పోయింది... నీకు సంబంధం ఖాయపరచాడు మావయ్య.....తాంబూలాలు కూడా పుచ్చుకున్నారు. మావయ్య చేసిన అవమానానికి అభిమానంతో క్రుంగి పోయింది అమ్మ.. 'నాకూతురు పెళ్ళికి అయ్యే ఖర్చు ఒకరు భరించ వలసిన ఖర్మ తనకేం పట్టలేదు' అంది. నీపెళ్ళికన్న ముందే నాపెళ్ళి జరిగి పోవాలని పంతం పట్టి మూడురోజులలోనే నాకు ఒక వరుణ్ణి తీసుకొచ్చింది. నన్నేంచేయమంటావ్ బావా?" ఏడుస్తూ మధు గుండెల పై వాలిపోయింది రాధ...

'భయపడకు రాధా! ఏమైనా మనపెళ్ళి జరిగి తీరుతుంది. అన్ని ఏర్పాట్లూ నేను చూస్తాను పద.... ఇంటికి పోదాం"— అంటూ రాధను వోదార్చి ఆమెను తీసుకొని ముందుకు నడిచాడు మధు. ..

"నువ్ ముందు నడు బావా! నేను తరువాత వస్తాను!. ఇద్దరం కలసి వెడితే చూసినవాళ్ళు అనుమానిస్తారు"—అంటూ తన చేయి విడిపించుకొంది రాధ.

అయిష్టంగానే ఆమెను వదలి బయల్దేరాడు మధు. మరో అరగంటకు వికలమయిన మనసుతో ఇంటికి చేరుకున్నాడు.

"రేపుదయం బస్‌లో వస్తావనను కున్నాను!" అన్నాడు సావిట్లో—కుర్చీలో కూర్చొని చుట్ట కాలుస్తున్న పరంధామయ్య.

"కొంప మునిగినట్టు టెలిగ్రాం ఇస్తే వెంటనే రావలసి వచ్చింది..విషయం తెలిస్తే అసలు రాక పోయే వాడిని"— నిర్లక్ష్యంగా జవాబు చెప్పి లోపలకు నడిచాడు మధు.

ఆరాత్రి ఇక ఏవిషయమూ ప్రస్తావించ టానికి పరంధామయ్యకు అవకాశం దొరకలేదు.

* * *

"నువ్వు నామాట తీసెయ్యవని తెలుసుండే వాళ్ళకు మాట యిచ్చాను"—

"నిజమే! నీమాట నేనెప్పుడూ గౌరవించాను. కానీ ఇది నాజీవితానికి సంబంధించిన సమస్య. కనీసం నాకు నచ్చిన పిల్లను పెళ్ళి చేసుకునేందుకైనా స్వతంత్రం లేదా?......"

"అంతటి తగని పిల్లను తీసుకొచ్చి నీకు కట్టబెట్టటాన్కి నేనేం మూర్ఖుడ్నికాను. ఇదిగో ఈ ఫోటో చూడు!.. పిల్ల బంగారు బొమ్మలా వుంది. కట్నం కూడా వేలక వేలు యిస్తున్నారు. వాళ్ళు తొందర పడితే— ఏవెలాగా అభ్యంతరం చెప్పవని తాంబూలాలు పుచ్చుకొన్నాం— వచ్చే నెలలో ముహూర్తాలు కూడా వున్నాయి." అంటూ తన లాల్చీ జేబులోంచి ఫోటో ఒకటి తీసి మధుకు ఇచ్చాడు. పరంధామయ్య.

"అవన్నీ నాకనవసరం! నేను రాధను తప్ప వేరే వర్నీ చేసుకో దల్చుకో లేదు"— సాగునిశ్చయంగా చెప్పాడు.

ఆమాటతో పరంధామయ్య నిశ్చేష్టుడయ్యాడు. కొన్ని క్షణాలకు తేరుకొని—

"రాధ చచ్చి పోయిందిరా!" అన్నాడు...

.. ... ...

"వాళ్ళమ్మ తొందపడి ఎవడ్నో వయసు మళ్లిన వాడ్ని తీసుకు వచ్చి వాడితో రాధకు పెళ్లి చేయటాన్కి ముహూర్తం పెట్టించింది. పెళ్లి మూడు రోజు లుందనగా వూరి చివర నూతిలో దూకి ఆత్మాహుతి చేసుకొంది రాధ....అప్పుడే ఇవాల్టికి నెలరోజులు కావస్తోంది!"—

పరంధామయ్య మాటలకు మధు అచేతనుడయ్యాడు. ●

